క్లుప్తంగా

ఆ నాయకుడిని అరెస్టు చేయాలి



రామన్నపేట: ఖమ్మం జిల్లా దేవాదాయశాఖ పరిశీలకురాలు సునీతపై ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు ట్రస్టు బోర్డు విషయంలో అనుచిత వ్యాఖ్యాలు చేశారని, ఈక్రమంలో ఆ నాయకుడిని వెంటనే అరెస్టు చేయాలని అర్చక ఉద్యోగ జేఏసీ నాయకులు గంగు ఉపేంద్రశర్మ డిమాండ్ చేశారు. ఈమేరకు భద్రకాళి ఆర్చి గేట్ వద్ద దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్లు, అర్చక ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి శనివారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో మహబూబాబాద్ ఇన్‌స్పెక్టర్ కవిత, ఈఓ శ్రీనివాస్, వేణుగోపాల్, ప్రసాద్, అర్చక ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

కాజీపేట రూరల్: రాష్ట్రస్థాయి ఉత్తమ నంది అవార్డు గ్రహీత కనకం రాజేందర్‌ను కాజీపేట బాపూజీనగర్ పోచమ్మ ఆలయం ప్రాంగణంలో తోజోమయి మాలకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మర్యాల కృష్ణ, బండి విజయ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ మలిదశ పోరాటంలో తన జానపద నృత్యాలు, మాటలు, పాటలతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేసిన రాజేందర్‌కు అవార్డు రావడం అభినందనీమని కొనియాడారు. కార్యక్రమంలో మాలకుల సంఘం నాయకులు పప్పుల గోవర్దన్, సిహెచ్.కొమ్మాలు, సిరిల్‌లారెన్స్, మైలారం శంకర్, వెంకటేష్, బొట్టు రాజు, బండి రాంచందర్, శేఖర్, జానపట్ల యాదగిరి, పోతుల సాంబయ్య, అలువాల అనిల్, ఉప్పల్‌రావు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



రామన్నపేట: ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని మెపా రాష్ట్ర అధ్యక్షుడు కొత్తగట్టు శ్రీనివాస్ పేర్కొన్నారు. వరంగల్‌లోని ఐఎంఏ హాల్‌లో మెపా జాబ్‌మేళాను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, ఎస్‌బీఐ లైఫ్, ఎస్‌బీఐ కార్డు, జియో, శ్రీరాం తదితర కంపెనీల ప్రతినిధులు రాగా, వివిధ ప్రాంతాల నుంచి సుమారు 200 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈమేరకు 60 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్ మాట్లాడుతూ మెపా ఎజెండాలో భాగంగా విద్యా, ఉపాధి, ఉద్యోగ సాధికారితే లక్ష్యంగానే ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 10వేల మంది ముదిరాజ్ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా కార్యాచరణ చేపట్టినట్లు వివరించారు.

గిరిజన వర్సిటీ ఏర్పాటు చేయాలి



ఖిలా వరంగల్: ములుగు జిల్లా కేంద్రంలో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేస్తూ గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని గిరిజన సమాఖ్య వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా దస్రునాయక్ డిమాండ్ చేశారు. గిరిజన సమాఖ్య ఏర్పడి 19ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో భూక్య శివరామకృష్ణ అధ్యక్షతన గిరిజన సమాఖ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా దస్రునాయక్ మాట్లాడుతూ గిరిజనులకు దామాషా ప్రకారం 10శాతం రిజర్వేషన్ ఇవ్వాలని, గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, పోడు రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన గిరిజన బంధును ఈబడ్జెట్‌లో ప్రవేశపెట్టాలని సూచించారు. సమావేశంలో ఉపాధ్యక్షురాలు దీపిక, లలిత, లక్ష్మి, స్వప్న, ఎల్లమ్మ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఆందోళన



కాజీపేట: తాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ కాజీపేట 63వ డివిజన్ విష్ణుపురి ఓవర్‌హెడ్ ట్యాంక్ ఎదుట బీజేపీ నాయకులు శనివారం ఆందోళన చేశారు. పది రోజులుగా నల్లాల ద్వారా తాగునీరు రాకపోవడాన్ని నిరసిస్తూ ప్రధాన గేట్ వద్ద పట్టణ బీజేపీ నాయకులు బైఠాయించారు. వెంటనే తాగునీరు సరఫరా చేయాలని నినాదాలు చేశారు. ఆందోళన కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు రావు అమరేందర్ రెడ్డి, నార్లగిరి రామలింగం, కుమారస్వామి, ఎండి.చాంద్‌పాషా, రాజ మహేంద్రన్, కె.సారయ్య, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

‘ప్రకటనలకే పరిమితమైన బీఆర్‌ఎస్’



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న నాయిని



చేనేత కార్మికులతో మాట్లాడుతున్న సురేఖ

హన్మకొండ చౌరస్తా: ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్‌ఎస్ నాయకులు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యారని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా వరంగల్ పశ్చిమలోని 9వ డివిజన్‌లో శనివారం పర్యటించారు. హనుమకొండలోని అమృత టాకీస్ వద్ద కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం డివిజన్‌లోని సుధానగర్, న్యూరాయపుర, కాకతీయకాలనీ తదితర ప్రాంతాల్లో తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత టాకీస్ వద్ద ఉన్న 20 ఫీట్ల వెడల్పు గల పెద్దమోరీపై పైకప్పు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని అన్నారు. అర్హత ఉన్నప్పటికీ వృద్ధాప్య, వికలాంగ పింఛన్లు రావడం లేదని ధ్వజమెత్తారు. కమీషన్లకు కక్కుర్తి పడుతూ అభివృద్ధి పనుల్లో అంతులేని అవినీతి పాల్పడుతున్న బీఆర్‌ఎస్ నేతలు.. తమ తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎండి.జాఫర్, నాయకులు ఎస్.రాజు, శివప్రసాద్, వరుణ్‌బాబు, ప్రణయ్‌కుమార్, ప్రేమ్, సోమయ్య, ఎజాస్, సుధాకర్, అనిల్, సరళ, లక్ష్మి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే న్యాయం

వరంగల్: కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అందరికీ న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే కొండా సురేఖ అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 23వ డివిజన్ గోపాలస్వామి గుడి వద్ద ప్రారంభమైన హాత్ సే హాత్ జోడో యాత్ర గోపాలస్వామి గుడి, పద్మశాలి సేవా సంఘం, మడేలయ్య గుడి, మాస్టర్ హోటల్, ఇందిరాగాంధీ విగ్రహం, మార్కండేయస్వామి గుడి, తుమ్మలకుంట, బాలాజీ సంఘం, ఆటోనగర్ మీదుగా శనివారం సాగింది. ఈమేరకు డివిజన్‌లోని ప్రజలను కలుస్తూ వారి కష్టసుఖాలను సురేఖ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్ షాపులను పాలకులు నిర్వీర్యం చేశారని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలెండర్, నిత్యావసర సరుకుల ధరలను అమాంతం పెంచారని ఆందోళన వ్యక్తం చేశారు.

దేశాభివృద్ధికి అందరూ పాటుపడాలి



యూనిటీ రన్‌ను ప్రారంభిస్తున్న కృష్ణసాయి

కాజీపేట రూరల్: దేశాభివృద్ధికి ప్రతీఒక్కరు పాటుపడి తమ ఐక్యతను చాటి చెప్పాలని కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ సీనియర్ డీఈఈ ప్రశాంత కృష్ణసాయి సూచించారు. కాజీపేట జంక్షన్‌లో రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా యూనిటీ రన్‌ను ప్రశాంత కృష్ణసాయి జెండా ఊపి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో రైల్వే మజ్దూర్ యూనియన్ జోన్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్, రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, ట్రెజరర్ జి.రాజేశ్వర్‌రావు, రైల్వే సూపర్‌వైజర్లు శ్రీనివాస్, బాపురెడ్డి, సతీష్‌కుమార్, పి.శ్రీనివాస్‌రావు, అన్సారీ, రాకేష్‌కుమార్, చంద్రకుమార్, చీఫ్ ఫార్మసిస్ట్ తిరుపతి, ప్రవీణ్, ఇన్‌స్టిట్యూట్ సభ్యులు పాల్గొన్నారు.

16 నుంచి ‘కేసీఆర్ క్రికెట్ ట్రోఫీ’



మాట్లాడుతున్న విజయ్‌భాస్కర్

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 17వ తేదీన సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో నాలుగో సీజన్ ‘కేసీఆర్ క్రికెట్ ట్రోఫీ’ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్‌భాస్కర్ తెలిపారు. బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ సారథ్యంలో ఆర్ట్స్ కళాశాల మైదానంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వరంగల్ క్రికెట్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి మార్నేని ఉదయభానురావు మాట్లాడుతూ మరిన్ని వివరాల కోసం అస్లాం (78939 44118), షాకీర్ (95732 87096) వీరు (99636 03676) నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థుల వెన్నుతడితే అద్భుతాలు ఆవిష్కృతం



ఎగ్జిబిట్లను తిలకిస్తున్న ప్రొఫెసర్ వెంకట్రాంరెడ్డి

హన్మకొండ చౌరస్తా: ప్రతీవిద్యార్థిలో ఏదో ఒక అంశంలో ప్రతిభ దాగి ఉంటుందని, ఈక్రమంలో వారిని వెన్నుతడితే అద్భుతాలు సృష్టిస్తారని కేయూ మాజీ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ బైరు వెంకట్రాంరెడ్డి అన్నారు. హనుమకొండ రెడ్డికాలనీలోని ప్రోగ్రెస్ హైస్కూల్‌లో ఇన్నోవేటర్స్ ఫెస్ట్ ఆఫ్ అటల్ -2023 ఎగ్జిబిషన్‌ను శనివారం నిర్వహించారు. వైజ్ఞానిక ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా వెంకట్రాంరెడ్డి హాజరై ఎలక్ట్రికల్స్ విభాగంలో విద్యార్థులు రూపొందించిన 70కి పైగా ఎగ్జిబిట్లను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సరైన మార్గనిర్దేశం చేస్తే మరింత గొప్ప ఫలితాలు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, పాఠశాల కరస్పాండెంట్ మల్లాడి ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ముదిరి నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి కృషి



మాట్లాడుతున్న గుండా ప్రకాష్

హసన్‌పర్తి: విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణం జరిగినప్పుడే దేశం అభివృద్ధి దిశలో పయనిస్తుందని మాజీ మేయర్ గుండా ప్రకాశ్ అన్నారు. హసన్‌పర్తి వాసవి క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో వైశ్యులు, వాసవి క్లబ్ సభ్యులు ముందు వరుసలో ఉండాలని పిలుపునిచ్చారు. గ్రామాలతో పాటు సర్కారు పాఠశాలలను దత్తత తీసుకుని మౌలిక సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. హసన్‌పర్తి వాసవి క్లబ్ నూతన అధ్యక్షుడిగా కరంచంద్, కార్యదర్శిగా మంచెన శ్యాంసుందర్, కోశాధికారిగా పురవర్ధన్ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీ దొడ్డ మోహన్‌రావు, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజేశ్వర్‌రావు, జిల్లా కార్యదర్శి సునీత, వైస్ గవర్నర్ సాంబమూర్తి పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై రుద్రాభిషేకం



అలంకరించిన ప్రాకార కవచం

కాజీపేట రూరల్: మడికొండలోని మెట్టుగుట్టపై శనివారం ప్రాతకాల మహాన్యాస రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం, మెట్టు రామలింగేశ్వర స్వామికి దాతలు ఆవాల రాధిక - నరోత్తంరెడ్డి, దొంతుల రాధ - సమ్మయ్య, పింగిలి మమత - రమేష్‌రెడ్డి, కొక్కొండ సరోజన - శ్రీనివాస్, తౌట్‌రెడ్డి సరిత - అశోక్‌రెడ్డి, వేదుల సునీత - రాజేశ్వర్‌రావు దంపతులు సుమారు రూ.2.70 లక్షల వ్యయంతో 138 కిలోల మిశ్రమ పంచలోహంతో తయారు చేసిన ప్రాకార కవచాన్ని బహూకరించారు. ఈమేరకు స్వామివారికి ప్రాకార కవచాన్ని అర్చకుడు రాగిచేడు అభిలాష్ శర్మ అలంకరించారు. కార్యనిర్వాహణ అధికారి శేషుభారతి, చైర్మన్ దువ్వ నవీన్, అర్చకులు పరశురాం, విష్ణువర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, ధర్మకర్తలు నార్లగిరి కుమారస్వామి, చింతకుంట్ల భూపాల్‌రెడ్డి, బుర్ర సంధ్యారాణి, ఓర్సు రాజు, పెద్ది ప్రభాకర్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

దివ్యాంగ, అనాథ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్

విద్యారణ్యపురి: విద్యా ఫౌండేషన్ ప్రతిభా పురస్కారాలను ఈఏడాది ఏప్రిల్‌లో జరగబోయే ఫౌండేషన్ వార్షికోత్సవంలో ప్రదానం చేయనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ల మహేందర్ తెలిపారు. హనుమకొండలోని ఫౌండేషన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022వ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదవ తరగతి చదివి ప్రతిభ చూపిన దివ్యాంగ, అనాథ విద్యార్థులకు పురస్కారాలు అందజేయనున్నట్లు చెప్పారు. అవార్డు, జ్ఞాపిక, ప్రశంసపత్రంతో పాటు ఒక్కొక్కరికి రూ.1016 నగదు బహుమతి అందజేస్తామని వివరించారు. మార్చి 20వ తేదీలోపు ఫౌండేషన్‌కు విద్యార్థులు తమ మార్కుల మెమో అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 91776 04430 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో ఫౌండేషన్ గౌరవ సలహాదారులు గురిజాల తిరుపతిరెడ్డి, సభ్యులు గజ్జల స్వరూప, బాలబోయిన రమాదేవి, గురిజాల శశికళ, కృష్ణ, వనపర్తి ప్రభాకర్, సుబ్బారాయుడు, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

వరిపొట్టుతో నీటి శుద్ధీకరణ



బంగారు పతకం అందుకుంటున్న మన్విత‌రెడ్డి

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల పెంబర్తి క్రాస్‌లోని ఏకశిల టెక్నో స్కూల్ విద్యార్థి మన్వితారెడ్డి ప్రదర్శించిన ఎగ్జిబిట్ బంగారు పతకం సాధించింది. ఇటీవల గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరిగిన నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ జాతీయస్థాయి పోటీల్లో ఏకశిల స్కూల్‌లో ఏడవ తరగతి చదువుతున్న ఎం.మన్వితారెడ్డి పాల్గొని ‘వరిపొట్టు బూడిదతో నీటి శుద్ధీకరణ’ అనే ఎగ్జిబిట్‌ను ప్రదర్శించింది. కాగా, ఈ ఎగ్జిబిట్.. ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకున్నట్లు ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి చెప్పారు.

సెంట్రల్ లైటింగ్ వెలుగులు



కాశిబుగ్గ: నగరంలోని రైల్వే స్టేషన్ - ఎస్ఎన్ఎం క్లబ్ రోడ్డు.. సెంట్రల్ లైటింగ్‌తో వెలిగిపోతోంది. ‘అంధకారంలో ఎస్ఎన్ఎం క్లబ్ రోడ్డు’ అంటూ సాక్షి దినపత్రికలో ఇటీవల కథనం ప్రచురితమైంది. దాంతో స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్ స్పందించి సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు రైల్వే స్టేషన్ - ఎస్ఎన్ఎం క్లబ్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్‌కు శనివారం మరమ్మతులు నిర్వహించి దీపాలు వెలిగేలా పనులు చేపట్టారు.

14న రుమటాలజీ వైద్య శిబిరం

హన్మకొండ చౌరస్తా: ఈనెల 14వ తేదీన హనుమకొండ కాకాజీకాలనీలోని ఏషియన్ రుమటాలజీ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మధుకర్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించే వైద్య శిబిరంలో సీనియర్ రుమటాలజిస్ట్ డాక్టర్ వి.సునీల్ పాల్గొని వైద్య పరీక్షలు చేస్తారని, అలాగే, రూ.2వేల విలువైన ఎముకల సాంద్రతను తెలిపే బీఎండీ పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. కీళ్లవాతం, మోకాళ్ల, నడుము, మడిమ, వెన్ను, మెడ తదితర నొప్పులతో బాధపడేవారు ఉచిత డాక్టర్ కన్సల్టేషన్ కోసం 99665 54455 నంబర్‌లో సంప్రదించి తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

సంక్షిప్తంగా

కార్మికుల పక్షపాతి సీఎం కేసీఆర్

హన్మకొండ: కార్మికుల పక్షపాతి సీఎం కేసీఆర్ అని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎంజాల మల్లేషం, లిఫ్ట్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ పెద్ది రఘుపతి రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు కార్మిక భవనం ఏర్పాటు చేస్తామని అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రకటించిన సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు హనుమకొండ వడ్డెపల్లి చర్చి కూడలిలో కేసీఆర్ చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు.

కేసీఆర్‌కు వాల్మీకి బోయల కృతజ్ఞతలు

నయీంనగర్: వాల్మీకి బోయలను గిరిజన తెగల (ఎస్టీ) జాబితాలో చేర్చాలని తెలంగాణ రాష్ట్ర శాసన సభలో ఏకగ్రీవ తీర్మానం ప్రవేశపెట్టి, తెలంగాణ ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చినందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా వాల్మీకి బోయ జాతి తరఫున సీఎం కేసీఆర్‌కు కన్వీనర్ నిగ్గుల వెంకటప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసాద్ మాట్లాడారు.

హోటల్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ

హన్మకొండ చౌరస్తా: ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్, సర్టిఫికేషన్ (ఫోస్టాక్) కేవీజీఎం సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండలోని శ్రేయ హోటల్‌లో హోటల్, ఐస్‌క్రీం పార్లర్, బేకరీ, చిప్స్ తయారీ, ఫాస్ట్‌ఫుడ్ నిర్వాహకులకు అడ్వాన్స్ కేటరింగ్‌లో హోటల్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ తరగతులను శనివారం నిర్వహించారు.

కన్నవారు దైవంతో సమానం

హసన్‌పర్తి: కన్నవారు.. దైవంతో సమానమని మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు అన్నారు. ఈమేరకు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం 55వ డివిజన్ భీమారం, కోమటిపల్లి గ్రామాలకు ఫీజర్లను శనివారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లిదండ్రులు జక్కుల పోచమ్మ - మొండయ్యల పేరిట పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఫీజర్లు అందించినట్లు వివరించారు.

అతిపెద్ద ఆరోగ్య బీమా పథకం

కాశిబుగ్గ: ఆయుష్మాన్ భారత్ పథకం ప్రపంచంలోనే అతిపెద్ద బీమా పథకమని, దీన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ తూర్పు నాయకుడు కుసుమ సతీష్ తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో 36వ డివిజన్ చింతల్‌లోని పోచమ్మగుడి సమీపంలో ఆయుష్మాన్ భారత్ నమోదు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.

విమర్శనాత్మక ధోరణి అలవర్చుకోవాలి

హసన్‌పర్తి: విద్యార్థులు విమర్శనాత్మక ధోరణిని అలవర్చుకోవాలని కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి అన్నారు. వరంగల్ కిట్స్‌లో లిటరరీ క్లబ్, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న సదస్సు శనివారం ప్రారంభమైంది. ‘మోడల్ యునైటెడ్ నేషన్స్ -23’ అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కిట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ నిరంజన్ రెడ్డి, ప్రొఫెసర్ శంకర్, ప్రొఫెసర్ నర్సింహారావు, పీఆర్వో డాక్టర్ ప్రభాకరాచారి పాల్గొన్నారు.

నేడు మడేలయ్య విగ్రహ ప్రతిష్ఠాపన

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ కాపువాడలోని దోబీఘాట్ పక్కన నూతనంగా నిర్మించిన ఆలయంలో రజకుల ఆరాధ్యదైవం మడేలయ్య విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలను ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు నాగపురి శ్రీనివాస్ తెలిపారు. మహిళలు బోనాలతో ఉదయం తరలిరావాలని కోరారు. కాగా, ఆలయ ప్రాంగణంలో శనివారం హోమం, పూజలు నిర్వహించారు.

హామీలు నెరవేర్చని సీఎం కేసీఆర్

కాజీపేట అర్బన్: డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తా, దావత్ చేసుకుందాం అని హామీలు ఇచ్చి నెరవేర్చని వ్యక్తి సీఎం కేసీఆర్ అని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఎద్దేవాచేశారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని దీన్‌దయాల్‌నగర్‌లో శనివారం రాత్రి ప్రజా గోస - బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదలకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటోందని అన్నారు.

భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు



పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కాశిబుగ్గ: 19వ డివిజన్ కాశిబుగ్గ ఓసిటీ రోడ్డులో మిషన్ భగీరథ పైపులైన్లకు అధికారులు శనివారం మరమ్మతులు చేయించారు. తాగునీరు వృథా అంటూ సాక్షి దినపత్రికలో శుక్రవారం కథనం ప్రచురితమైంది. ఈమేరకు స్పందించిన అధికారులు.. పైపులైన్‌కు మరమ్మతులు చేయించి ఫ్లో మీటర్ ఏర్పాటు చేశారు. కాగా, ఫ్లో మీటరు ఏర్పాటుకు పైపులైన్‌ను తవ్వినట్లు వారు తెలిపారు.

ఆత్మీయత పంచుకున్న పూర్వ విద్యార్థులు



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు



ఆత్మీయ సమ్మేళనంలో మహిళా ఉపాధ్యాయులు

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ విద్యానగర్ కాలనీలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం జరిగింది. 2003-04వ సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఒకచోట కలుసుకొని నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత హెచ్‌ఎం సుధాకర్, కనకమ్మ, రమేష్ బాబు, పెరుమాండ్ల సాంబమూర్తి, పూర్వ విద్యార్థులు బి.వినయ్‌కుమార్, మురళి, మహేష్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం

హనుమకొండ జిల్లా కేంద్రంలోని లష్కర్ బజారు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 2000-2009 వరకు పని చేసిన మహిళా ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం శనివారం జరిగింది. ఆనాడు పాఠశాలలో పని చేసి పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులు, ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయులు ఒక చోట కలిసి సందడి చేశారు.

ఉర్సు ఉత్సవాలకు పటిష్టమైన భద్రత



దర్గా పీఠాధిపతులతో ఏసీపీ కిషన్

ఖిలా వరంగల్: కరీమాబాద్‌లో ఫిబ్రవరి 13నుంచి 15వ తేదీ వరకు జరగనున్న హజ్రత్ మాషూక్ దర్గా ఉర్సు ఉత్సవాల్లో కట్టుదిట్టమైన భద్రత పరమైన చర్యలు తీసుకుంటామని వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ తెలిపారు. ఈమేరకు వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని హజ్రత్ మాషూక్ రబ్బానీ దర్గా పీఠాధిపతులు సయ్యద్‌షా హైదర్ హిలాల్‌యొద్దీన్ ఖాద్రీ(నవీద్‌బాబా), సయ్యద్ అలీషా ఖాద్రీ (ఉబేద్‌బాబా), తవక్కల్ వెల్ఫేర్ ట్రస్టు చైర్మన్ ఎంఏ.జబ్బార్, మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్‌లతో కలిసి ఉర్సు దర్గాను ఏసీపీ శనివారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా జరుగుతున్న ఉత్సవాల ఏర్పాట్లను కిషన్ పరిశీలించారు. అంతకుముందు పీఠాధిపతులతో కలిసి దర్గాను దర్శించుకుని ఏసీపీ కిషన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

14న తాండ్ర కుమార్ విగ్రహావిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ: ఎంసీపీఐ (యూ) రాష్ట్ర మాజీ కార్యదర్శి తాండ్ర కుమార్ విగ్రహావిష్కరణ మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ రెడ్డి హంసారెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మహాసభల వాల్‌పోస్టర్లను నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14న మధ్యాహ్నం హైదరాబాద్ మియాపూర్ నుంచి ముజాఫర్ అహ్మద్‌నగర్ వరకు ప్రదర్శన నిర్వహించి కుమార్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రథమ వర్ధంతి సభ జరుగుతుందన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే కీలకం



కవాతు చేస్తున్న ఆర్‌ఏఎఫ్ సిబ్బంది

ఖిలా వరంగల్: దేశ, రాష్ట్ర అంతర్గత భద్రతలతో పాటు ప్రజల శాంతిభద్రతల పరిరక్షణలో సీఆర్‌పీఎఫ్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఏఎఫ్) అత్యంత కీలకమని వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, 19వ ఆర్‌ఏఎఫ్ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ జితేంద్రనందవాల్ అన్నారు. ప్రజల్లో ధైర్యం నింపేందుకే ఆర్‌ఏఎఫ్ పోలీసులు ఆయుధాలు పట్టి కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ఆర్‌ఏఎఫ్ 19వ బెటాలియన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ నేతృత్వంలో రంగశాయిపేట మహంకాళి దేవాలయం ప్రాంగణం నుంచి కరీమాబాద్ ఉర్సు దర్గా మీదుగా అండర్ బ్రిడ్జి వరకు నాలుగు కిలోమీటర్ల మేర 74మంది ఆర్‌ఏఎఫ్ సిబ్బంది ఆధునాతన ఆయుధాలు చేత పట్టి శనివారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్, జితేంద్రనందవాల్ మాట్లాడుతూ ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసు యంత్రాంగం పనిచేస్తోందని వివరించారు.

రెడ్డి సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి

కాజీపేట రూరల్: రెడ్డి సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని వరంగల్ జిల్లా పరిషత్ చైర్మన్ గండ్ర జ్యోతి అన్నారు. మడికొండలోని రెడ్డి సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్‌లో రెడ్డి సంక్షేమ సంఘం డైరీ ఆవిష్కరణ, సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాదిరెడ్డి రవీందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నివేదికలను సంఘం సహాయ కార్యదర్శి చందుపట్ల సత్యనారాయణ రెడ్డి, కోశాధికారి చాడా సునీల్‌రెడ్డి సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాదిరెడ్డి శ్రీనివాస్, సంఘం ఉపాధ్యక్షుడు ముద్దసాని పద్మనాభరెడ్డి, కార్పొరేటర్ చాడా స్వాతి, పూర్వ అధ్యక్షుడు కె.జనార్దన్ రెడ్డి, డాక్టర్ కొండపల్లి పాల్గొన్నారు.